క్లుప్తంగా

బకాయిలు వెంటనే చెల్లించాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీలో పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేశారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.1000 కోట్లతో బకాయిలు ఉన్నాయి. బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అప్పటి వరకు కాంట్రాక్టర్స్ ఎవరూ పనులు చేయమని తీర్మానించారు. 'నో పేమెంట్.. నో వర్క్'నినాదంతో ధర్నా కార్యక్రమం చేపట్టారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

మూసాపేట: వైద్యం వికటించి చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. భరత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ వాచ్మెన్‌గా పని చేస్తున్న శంకర్ నాయక్ కుమార్తె దనేశ్వరి(12) జ్వరం రావడంతో కాలనీలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యం వికటించి చిన్నారి మృతి చెందిందని, బంధువులు, తల్లిదండ్రులు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. యాజమాన్యం నష్టపరిహారం ఇప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్: బాలానగర్ నర్సాపూర్ క్రాస్ రోడ్డులో ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆశావర్కర్లు నిరసన తెలిపారు. గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం ప్రజాస్వామ్యం చాలా ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలల్లో అల్పాహార పథకం షురూ

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మానవీయ కోణంలో ఆలోచించే గొప్ప ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని అన్నారు. ఇప్పటికే నిరుపేద విద్యార్థులైన పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం పెట్టడమే కాకుండా నేడు అల్పాహారం అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఎంతోమంది నిరుపేద బిడ్డలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని వారందరికీ నేనున్నానని భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి లాంటి గొప్ప నాయకుడు మరెక్కడా లేరని అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలన్నీ నిరుపేదలకు మేలు చేకూర్చేవేనని ఆయన ఆలోచన ముందుగా పేదల కుటుంబ నుంచి మొదలవుతుందన్నారు. కేవలం 10 ఏళ్లలో ప్రతి ఇంటికి సంక్షేమం అందించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మమత, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎంఈఓ ఆంజనేయులు, ఉపాధ్యాయులు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జెడీసీ మమత

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం 21 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 9 లక్షల 99 వేల రూపాయల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సీఎం రిలీఫ్ ఫండ్ రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తెచ్చుకోవాల్సి వచ్చేదన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి కేటీఆర్ నాయకత్వంలో నిరుపేదలకు నేనున్నానంటూ త్వరితగతిన మంజూరు చేస్తున్నారని తెలిపారు. మానవీయ కోణంలో ఆలోచించి సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కి దక్కుతుందని అన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు చీరలను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జోనల్ కమిషనర్ మమతతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని కులాలు, అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్నామన్నారు. మహిళల కోసం ప్రత్యేక పార్కులు, వారి రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు.



చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడీసీ

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఖార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ అందిస్తున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో కుట్టు శిక్షణ పొందుతున్న వారికి వెయ్యి మంది మహిళలకు కుట్టు మెషిన్లు అందిస్తున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్, కేపీహెచ్‌బీ 4వ ఫేజులోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఆయా డివిజన్ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సబిహాబేగంలతో కలిసి కుట్టు మెషిన్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించి ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. ఆ ఉద్దేశంతో తన వంతు సహాయంగా ఖార్డు సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించి కుట్టు మెషిన్లు, ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని అన్నారు. అందుకు సహకరిస్తున్న ఖార్డు సంస్థ అధినేత సుమన్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, ఖార్డ్ సంస్థ అధినేత సుమన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మెషిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి

ఎస్సీ బస్తీలో 52మందికి కుట్టు మెషిన్ల అందజేత

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఎస్సీ బస్తీ వీకర్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం కుట్టు మెషిన్లను పంపిణీ చేశారు. ఖార్డ్ సంస్థ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నరసింహాయాదవ్ సహకారంతో శిక్షణ పూర్తి చేసికున్న 52 మందికి శనివారం కుట్టు మెషిన్లతో పాటు 10 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబానికి చేదుడువాదోడుగా ఉండాలే ఆలోచనతో కుట్టు శిక్షణా కేంద్రంతో పాటు కుట్టు మెషిన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఖార్డ్ సంస్థ వ్యవస్థాపకులు సుమన్ మల్లాది, డైరెక్టర్ మంజులత మల్లాది, బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, జంగయ్య, నర్సింగ్ రావు, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీ నుంచి భవానీనగర్ వరకు రూ.90లక్షల నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, కంచి భిక్షపతి, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ కుతాడి రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించాలి



కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి 2016లో అప్పటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరితో శంకుస్థాపన చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తెలిపారు. కానీ ఇప్పటి వరకు కళాశాల భవనాన్ని నిర్మించలేదన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి త్వరలో కళాశాల భవనాన్ని కడతామని మాట ఇచ్చి ఇప్పటి నిర్మించలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని, ప్రజల్ని మోసం చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని తప్పుబడుతూ శుక్రవారం కళాశాలను సందర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

◆ ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి జరిగిందని అబద్ధపు మాటలు చెబుతున్నారని, నియోజకవర్గంలో అభివృద్ధి అనేది ఒట్టి అబద్ధపు మాట అని అన్నారు. కళాశాల భవనం కోసం 2016లో శిలాఫలకం వేస్తే 2021లో కాంగ్రెస్ పార్టీ తరపున ధర్నా చేసినప్పటికి శిలాఫలకం వేసి 5 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. ఇప్పటికి ఏడు సంవత్సరాలు అయినా భవనాన్ని ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కళాశాల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పారెడ్డి, నాగిరెడ్డి, తూము వేణు, బండారి నవీన్‌గౌడ్, నర్సింహ యాదవ్, కృష్ణరాజ్‌పుత్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో అగ్నిప్రమాదం



మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ మెట్రోస్టేషన్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం రాత్రి ఫర్నిచర్ షాప్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఆరు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఎంఎస్ ఫర్నిచర్ షాప్ రెండంతస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉద్యోగులందరూ ఇంటికి వెళ్లిపోయే సమయం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. సుమారు రూ.50లక్షల మేర ఆస్తి నష్టం జరగొచ్చని పేర్కొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

బాలానగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... నిరుపేద ఆడబిడ్డల సంతోషం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త చీరలను ధరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి గత 9 సంవత్సరాలుగా చీరలను అందిస్తున్నారని అన్నారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల తదితర ప్రాంతాల్లో నేతన్నలతో వీటిని తయారు చేయిస్తున్నారన్నారు.

◆ **మూసాపేట:** ఆడపడుచులు సంతోషంగా బతుకమ్మ పండగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరలను అందిస్తున్నారు. మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని జనతానగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.